క్లుప్తంగా

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్, ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు, రోగనిరోధక శక్తి పెరిగేందుకు టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, నర్సుబాయి, ఇందిర, అనురాధ, సబిత, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సమస్యపై చర్యలు



అంబర్‌పేట: కలుషిత తాగునీటి సరఫరాపై జలమండలి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. డివిజన్‌లో బురుజుగల్లి, గౌడ సంఘం భవన్ ప్రాంతాల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నట్లు స్థానికుల ఫిర్యాదుతో ఆమె బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. జలమండలి అధికారులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. స్థానిక బీజేపీ నాయకులు, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర సంస్థల పరిధిలోని భూములనూ క్రమబద్ధీకరించండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీపీఎం నేత ఎం.శ్రీనివాస్ లేఖ

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల్లోని పేదల ఇళ్లను జీవో 58 ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తున్న మాదిరిగానే కంటోన్మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లోని బస్తీలు, కాలనీలను కూడా క్రమబద్ధీకరించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు 58 జీవోను అమలు చేస్తున్నదని, కొన్ని మురికివాడల ప్రజలు దీని ద్వారా ఇళ్ల పట్టాలు పొందారని, ప్రస్తుతం అనేక మంది దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. హైదరాబాద్ సిటీలో కొన్ని మురికివాడలు, కంటోన్మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలాల్లోనూ ఉన్నాయని, ఈ స్థలాల్లో వేలాది మంది నిరుపేదలు జీవిస్తున్నారని పేర్కొన్నారు. కంటోన్మెంట్, రైల్వే, రక్షణ, ఎయిర్‌పోర్టు ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లోని పేదల ఇళ్లను కూడా జీవో 58 మాదిరిగా క్రమబద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. రైల్వే శాఖకు చెందిన వందల ఎకరాల భూములను దీర్ఘకాలిక లీజ్‌పేరుతో కార్పొరేట్ కంపెనీలకు చౌకగా కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం పేదలు దశాబ్దాలుగా నివసిస్తున్న ఇంటి మీద వారికి హక్కు కల్పించకపోవడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లో ఏర్పడ్డ బస్తీలు, కాలనీల స్థలాలను అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

'పరుశురామ భవన్'గా పేరు పెట్టాలి

నల్లకుంట: గోపన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ సదన భవనానికి పరుశురామ భవన్‌గా పేరు పెట్టాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ (టీబీపీ) పెద్దలను బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సీఎం కేసీఆర్ సహృదయంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడం గొప్ప విషయమని కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని బ్రాహ్మణ భవనానికి పరుశురామభవన్‌గా నామకరణం చేయడం విషయంలో పెద్దలు రమణాచారి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణ సదన్ ఎదురుగా పరుశురామ విగ్రహం కూడా ఏర్పాటు చేయించాలన్నారు. బ్రాహ్మణ సంక్షేమానికి పెద్ద పీటవేస్తున్న సీఎం కేసీఆర్ బ్రాహ్మణ పక్షపాతి అని అభిప్రాయపడ్డారు. దీనిపై టీబీపీ కార్యవర్గానికి ఓ లేఖ కూడా రాశామన్నారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంచనపల్లి రాజేంద్రప్రసాద్, దేవులపల్లి రంగారావు, అశోక్‌కుమార్, దేవులపల్లి బాలచందర్, ప్రతినిధులు రమాకుమార్ దేశ్‌ముఖ్, మంత్రి సునీల్ తదితరులున్నారు.

సేవే పరమావధిగా.. పేదలకు అండగా.. !

ఆదర్శంగా నిలుస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: సాయం విలువ అది చేసే వారికే అర్థం అవుతుంది. సేవే పరమావధిగా కష్టాల్లో ఉన్న పేద వారిని ఆదుకుంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. సీనియర్ అడ్వకేట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్.

బతికి ఉన్నంత వరకే 'బలగం'

- బతికుండగానే పోషణ భారంగా భావించి కన్న తల్లిదండ్రులను నడిరోడ్డు మీదకు నెట్టేసే వారు కొందరైతే.. కట్టెల్లో కాలే కట్టెను పక్కనబెట్టి ఆస్తుల కోసం గొడవపడేవారున్నారు. కొందరూ చనిపోయిన వారు తెలియకపోయినా 'అంతిమ సంస్కారం'గా చేతులెత్తి మొక్కే వారు ఈ లోకంలో ఉన్నారు.
- ఏ దిక్కూ లేకుండా ప్రాణాలు కోల్పోయినవారి అంతిమయాత్ర కోసం కొందరు పరితపిస్తున్న వారు ఉన్నారూ.. వారిలో ఎమ్మెల్యే కాలేరు ఒకరు.
- నేటి సమాజంలో ప్రతి ఇంటా ఎన్నో సమస్యలు, మరెన్నో ఇబ్బందుల నేపథ్యంలో పార్థీవదేహన్ని కాటికి పంపడం తలకు మించిన భారమైంది. అంత్యక్రియల కోసం ఎవరైనా వచ్చి అడిగితే అయ్యే ఖర్చు మొత్తం ఎమ్మెల్యేనే భరించుకుంటున్నారు.



కాచిగూడలోని హిందూ శ్మశానవాటిక

అనాథలకు అంతిమ సంస్కారం ..

- అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తుస్తూ.. ప్రతినెలా ఒక్కో పార్థీవదేహం దహన సంస్కారానికి రూ.4,500 చొప్పున నెలలో దాదాపు 20కి పైగా మృతదేహాలకు ఎమ్మెల్యే అంత్యక్రియలు నిర్వహించినట్టు సమాచారం.

ఇతరుల కష్టాలను అర్థం చేసుకుంటారు..



పేదలను ఆదుకోవడంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేసే ఆర్థికసాయం మరువలేనిది. ఎవరైనా ఆపదలో ఉండి దహన సంస్కారాలకు డబ్బు ల్లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. తన చుట్టూ ఉన్న వారికి సాయం చేసేందుకు ఆయన చేస్తున్న కృషి మరువలేనిది.

– కుమార్, మేనేజర్, హిందూ శ్మశానవాటిక కాచిగూడ

టెలీకమ్యూనికేషన్స్‌పై యువత అవగాహన పెంచుకోవాలి



విజేతలతో రాకేష్‌కుమార్‌సింగ్

చిక్కడపల్లి: టెలీకమ్యూనికేషన్స్‌ఎపై యువత అవగాహన పెంచుకోవాలని 'కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్స్' రాకేష్‌కుమార్ సింగ్ సూచించారు. బుధవారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ టెలికమ్యూనికేషన్స్ దినోత్సవం సందర్భంగా మహిళలు గిరిజన గ్రామీణ జనాభాలో సాధికారతకు 'టెలికాం సాంకేతిక వినియోగం' అంశంపై యువతకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. నేడు టెలికమ్యూనికేషన్స్ రంగం విస్తృతంగా పెరిగిందని సెల్‌ఫోన్ వినియోగదారుల సంఖ్య దేశంలో అధికంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువత ఈ రంగం గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. వచ్చే మూడేళ్లలో 6జీ దేశమంతా అందుబాటులోకి వస్తుందని దీనిపై అధ్యయనం వేగవంతంగా జరుగుతోందని అభిప్రాయపడ్డారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత విస్తృతంగా గోప్యత, భద్రతను పాటించాలన్నారు. వ్యాసరచనలో ప్రవీణ్, ఆంజనేయులు, ప్రవళికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలు కాగా.. వక్తృత్వంలో ప్రతీక్, మహేష్, తిరుపతిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జాయింట్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ చొంగ్లా ఇయన్‌మెచక్ సంపర్, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్స్ డి.సురేఖమూర్తి, టెలీకమ్యూనికేషన్స్ అధికారులు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు కల్పనాయాదవ్ తదితరులు



అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న గుర్రం శంకర్

ముషీరాబాద్: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌యాదవ్ నియామకంపై ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర ఆర్. కల్పనాయాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జల రుషికేష్, బీ–బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, మురళీమోజెస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: ముషీరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆయన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. చంద్రకళ, శీలం సత్యనారాయణ, గౌరీశంకర్, సురేష్‌యాదవ్, హాఫీజ్ తదితరులున్నారు.

- గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. నాయకులు మజార్ హుస్సేన్, సంపత్ పాల్గొన్నారు.

పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని నిరసన



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కవాడిగూడ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ చరణ్‌సింగ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ జాతీయ కార్యవర్గ సభ్యులు దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న క్రమంలో వారికి సంఘీభావం తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రెజ్లర్ల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకుండా వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి గురుబందన్‌సింగ్, వాజీద్, సుధాకర్, ప్రేమ్‌పావని, మంజుశ్రీ, రాజశ్రీ, రాములుయాదవ్, వేణు, గోవింద్, జావేద్, రాంచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితోనే రక్తపోటు



సదస్సులో పాల్గొన్న నాగేశ్వరి, పద్మాకమలాకర్

చిక్కడపల్లి: ఒత్తిడితోనే రక్తపోటు పెరుగుతోందని ప్రముఖ వైద్యులు నాగేశ్వరి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం అశోక్‌నగర్‌లోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో సెమినార్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రక్తపోటును ఖచ్చితంగా కొలవడం వల్ల నియంత్రించుకోవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా రక్తపోటుపై తక్కువ అవగాహన ఉందన్నారు. విద్యార్థి దశలో రక్తపోటు బాగా పెరుగుతోందని దీన్ని అదుపులో ఉంచుకోకపోతే శారీరక, మానసిక సమస్యలు పెరుగుతాయన్నారు. పి.స్వరూపరాణి, జి.కృష్ణవేణి, గుజరాత్ రక్ష యూనివర్సిటీ ఫ్యాకల్టీ హిప్నో సరోజారాయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కవాడిగూడ: రోడ్డు దాటుతున్న యువతిని ఢీకొట్టి డివైడర్‌పై పడి ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా రోడ్డు దాటుతున్న యువతికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ట్యాంక్‌బండ్‌పై మంగళవారం అర్ధరాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాంధీనగర్ ఎస్సై రేఖా నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన సుధాకర్ (25) ప్రైవేటు ఉద్యోగి. కాగా అతని స్నేహితుడు సుదీప్‌తో కలిసి ద్విచక్ర వాహనం (ఏపీ10డీఈ1437)పై రాత్రి అడ్డగుట్ట సికింద్రాబాద్ మీదుగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న చిల్డ్రన్ పార్కు వద్దకు రాగానే రోడ్డు దాటుతున్న ఓ యువతిని ఢీకొట్టి అనంతరం డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న సుధాకర్ తలకు తీవ్రగాయాలు కావడంతో పాటు వెనకాల కూర్చున్న సుదీప్‌కు గాయాలయ్యాయి. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. సుధాకర్ కొద్దిసేపటి క్రితం మృతి చెందాడు. ఇదే ఘటనలో మెహిబూబ్‌పట్నం గుడిమల్కాపూర్‌కు చెందిన హేమశ్రీ (17) కవాడిగూడలో ఓ ఫంక్షన్‌లో పాల్గొన్న అనంతరం ట్యాంక్‌బండ్‌పై చిల్డ్రన్‌పార్కు వద్ద రోడ్డు దాటుతుండగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నల్లకుంట: ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింహ, కానిస్టేబుల్ వెంకటేష్‌గౌడ్‌తో మార్నింగ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో వీఎస్‌టీ రోడ్డు కట్ట మైసమ్మ ఆలయం సమీపంలో ఫుట్ పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి (40–45) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం రావడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కాగా అతడు అప్పటికే మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి గాంధీ మార్చురికీ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తరఫున వారు నల్లకుంట పోలీసులను సంప్రదించాలని కోరారు.

అన్నదానం



కవాడిగూడ: ముషీరాబాద్‌లోని రెయిన్‌బో అనాథాశ్రమ హాస్టల్‌లో పులి స్వరూప మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షులు పులి శ్రీశైలంగౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, కోశాధికారి సందీప్‌గౌడ్‌లు హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. పులి స్వరూపగౌడ్ చేసిన సేవకు ప్రతిరూపంగా ఆమె వర్ధంతి రోజున అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రవళిక, సాన్విక, సహస్ర, మల్లేష్, రమేష్, సక్కుబాయి, రేఖ, అరుణ, ఉమా, సతీష్, బబ్లూ, సాయి, తనుషా, అనిషిత తదితరులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీఈఓ రోహిణీలు

అంబర్‌పేట: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలను అన్ని హంగులతో ఆధునీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం గోల్నాక డివిజన్ గంగానగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను 'మన బస్తీ– మన బడీ' పథకం కింద రూ.25.30 లక్షలతో పూర్తి చేసి ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భవనానికి రంగులు, బెంచీలు వంటి తదితర వసతులను ఏర్పాటు చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులున్నా.. తన దృష్టికి తీసుకొస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఈఓ ఆర్.రోహిణి, డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఐఓఎస్ ఎండీ ఖాజా నిజాముద్దీన్, విద్యాశాఖ అధికారులు ఎస్. రజిత, విజయలక్ష్మి, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావ ప్రార్థనలు



మాట్లాడుతున్న ఏఐసిఎఫ్ కో– ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు

కాచిగూడ: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ.. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావంగా శాంతి ప్రార్థలను నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర కో– ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు ప్రకటించారు. బుధవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐసీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ అబ్రహంతో కలిసి ఆయన మాట్లాడారు. మే 21న ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే శాంతి ప్రార్థనల్లో వందలాది మంది క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లౌకిక, ప్రజాస్వామిక, అభ్యుదయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ మైనార్టీ మోర్చా నేషనల్ మీడియా వర్క్‌షాప్



జమాల్ సిద్ధికీని సన్మానిస్తున్న ఐజాక్ రాజ్

నల్లకుంట: బీజేపీ మైనార్టీ మోర్చా నేషనల్ మీడియా ఆధ్వర్యంలో ఢిల్లీలో ఒక్క రోజు మీడియా వర్క్ షాప్ నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా జాతీయ అధ్యక్షుడు మాల్ సిద్ధికీ హాజరై ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా మీడియా పాత్రను వివరించారు. 9 కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశంలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇతర అంశాలపై ప్రసంగించారు. ఈ వర్క్ షాప్‌కు రాష్ట్రం నుంచి బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధికీని కలిసి శాలువాతో సన్మానించారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు

ముషీరాబాద్: కరాటే మనిషిలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లోని గోల్డెన్ డ్రాగెన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా మంది చిన్నారులు ఆటలంటే సెల్‌ఫోన్‌లో ఆడేవి అని అనుకుంటున్నారన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతి విద్యార్థి ఆట స్థలాలలో ఆటలు ఆడాలని సూచించారు. దీంతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలు కావొద్దని అందులోని మంచిని మాత్రమే గ్రహించాలన్నారు. అకాడమీ నిర్వాహకులు, కరాటే మాస్టర్ విక్కి తదితరులున్నారు.



విద్యార్థులతో ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

నాలా పూడికతీత పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: హుస్సేన్‌సాగర్ నాలా పరిసర ప్రాంతాల్లో పూడికతీత పనులను ముమ్మరం చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 1,2,3 అశోక్‌నగర్ నాలాకు అనుకుని ఉన్న అన్నిచోట్ల డీసిల్టింగ్ పనులను బుధవారం ఆమె జీహెచ్ఎంసీ ఇరిగేషన్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ గీత, ఏఈ అబ్దుల్ సలామ్‌తో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా నాలా పరీవాహక ప్రాంతాల్లో వరదనీటితో ప్రజలకు సమస్యలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముందు ఉన్న లోతుకంటే మరింతగా పూడికతీత పనులు నిర్వహించాలని సూచించారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, సురేందర్, ఉమేష్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కాంట్రాక్టర్ లక్ష్మణ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో కుట్టివెల్లోడీ ఆస్పత్రి

- తాత్కాలికంగా మెట్టుగూడ ఆర్టీసీ భవనంలోకి మార్పు
- భవన నిర్మాణానికి రూ.12.75 కోట్లు మంజూరు
- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



సంబంధిత అధికారులతో చర్చిస్తున్న పద్మారావుగౌడ్

చిలకలగూడ : సీతాఫల్‌మండి కుట్టివెల్లోడీ ఆస్పత్రిని మెట్టుగూడ ఆర్టీసీ భవనంలోకి తాత్కాలికంగా తరలించి, ఆస్పత్రి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత ఇంజనీర్లు, వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన కుట్టివెల్లోడీ ప్రభుత్వ ఆస్పత్రి స్థానంలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12.75 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత ఆస్పత్రిని మెట్టుగూడలోని ఆర్టీసీ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, రవాణా మంత్రి, ఆర్టీసీ చైర్మన్, సీఎండీలతో పలుమార్లు చర్చించగా వారు అంగీకరించారని వివరించారు. కుట్టివెల్లోడి ఆస్పత్రి పక్కనే ఉన్న అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వేరే చోటికి తరలించి, నూతన భవన నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం నూతన ఆస్పత్రి భవన నిర్మాణం, ఆధునిక హంగులు, అత్యాధునిక వైద్య యంత్రాలు, వైద్యసేవలు, శస్త్ర చికిత్సలు, ప్రసూతి సేవలు తదితర అంశాలపై చర్చించి, బ్లూప్రింట్లను పరిశీలించారు. నిరుపేదలకు వైద్యసేవల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ఆస్పత్రి నూతన భవన సముదాయాల నిర్మాణ పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. వైద్యాధికారి సక్కుబాయితోపాటు వివిధ వైద్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, వైద్యవిధాన పరిషత్ అధికారులు, ఇంజినీర్ల బృందం పాల్గొన్నారు.